ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పార్క్ ఎడిషన్ Evening 6PM
సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 131 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/- సోమవారం16 డిసెంబర్ 2024
RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# పోలవరం ప్రాజెక్టును సందర్శించిన చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పనులను పరిశీలించారు.



పోలవరం,డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. విహంగ వీక్షణం ద్వారా ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు పురోగతిపై అధికారులు, ఇంజినీర్లతో ఆయన సమీక్షించనున్నారు. ప్రాజెక్టు పనులు, నిర్వాసితుల పునరావాసంపై చర్చించనున్నారు.సీఎం పర్యటనతో పోలవరం నిర్మాణం, పునరావాసం, పరిహారంపై స్పష్టత వస్తుందని రైతులు, నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు. 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు కూటమి సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా చేపట్టే పనుల షెడ్యూల్ను సీఎం వెల్లడించనున్నారు.

# సోనియా తీసుకున్న నెహ్రూ లేఖలు అప్పగించండి :రాహులు కోరిన పీఎం మెమోరియల్

దివంగత ప్రధాని జవహర్లాల్ నెహ్రూకు సంబంధించిన లేఖలను 2008లో సోనియా గాంధీ తమవద్ద నుంచి సేకరించారని, వాటిని తిరిగి అప్పగించాలని పీఎంఎంఎల్ కోరింది.



దిల్లీ, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రాసిన లేఖల ను తిరిగి అప్పగించాలని ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం అండ్ లైబ్రరీ (ప్రధానమంత్రి సంగ్రహాలయ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కి లేఖ రాసింది. వాటిని 2008లో పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ తీసుకున్నారని, తిరిగి అప్పగించే విషయంలో సహకరించాలని కోరింది.ఇదీ చదవండి: నా ఎదుగుదలకు, పతనానికి గాంధీ కుటుంబమే కారణంచరిత్రక ప్రాముఖ్యత కలిగిన నెహ్రూ లేఖల ను జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్ 1971లో నెహ్రూ వె-ంమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీకి అప్పగించింది. అయితే 2008లో 51 బాక్సుల్లో ప్యాక్ చేసిన వాటిని సోనియాగాంధీకి పంపారు. అప్పటినుంచి అవి ఆమె వద్దే ఉన్నాయి. వాటిని తిరిగి అప్పగించాలని సెప్టెంబర్లోనే పీఎంఎంఎల్ కోరింది. మరోసారి రాహులు డిసెంబర్ 10న అదేతరహా అభ్యర్ధన చేసింది. కనీసం ఫొటో కాపీస్ లేక డిజిటల్ కాపీస్ అయినా అందించాలని అడిగింది. ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.నెహ్రూ, ఎడ్వినా మౌంట్బాటెన్, ఆల్బర్ట్ ఐన్స్టీన్, జయప్రకాశ్ నారాయణ్, పద్మజా నాయుడు, విజయ లక్ష్మీ పండిట్, అరుణా అసఫ్ అలీ, బాబు జగ్జీవన్ రామ్, గోవింద్ వల్లభ్ పంత్ వంటి ప్రముఖుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు వాటిలో ఉన్నాయి. జాతి నిర్మాణంలో కీలకభూమిక పోషించిన ప్రధానుల జ్ఞాపకాలతో ప్రధాని సంగ్రహాలయాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

# ఏపీ నుంచి ముగ్గురు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం

డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ నుంచి ఎన్నికైన ముగ్గురు నేతలు రాజ్యసభ సభ్యులుగా ప్రమాణం చేశారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధనడ్ వారి చేత ప్రమాణం చేయించారు. రాష్ట్రం నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో తెదేపా నుంచి బీద మస్తాన్రావు, సానా సతీష్ బాబు, భాజపా నుంచి ఆర్. కృష్ణయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే.



# తెలంగాణ తల్లి రూపం మార్పుపై కొట్లాడే హక్కు భారాసకు లేదు : విజయశాంతి

2007లో తల్లి తెలంగాణ పార్టీ మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి



హైదరాబాద్, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): 2007లో తల్లి తెలంగాణ పార్టీ మొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి తెలిపారు. అప్పుడు విగ్రహాన్ని బీఎస్ రాములు రూపొందించారని పేర్కొన్నారు. అనంతరం కొంత కాలానికి భారాస తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని చెప్పారు. కానీ ఆ పార్టీ 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నా.. విగ్రహానికి అధికారిక హోదా, గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్' వేదికగా పోస్టు చేశా-రు.ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పని చేసిందని చెప్పారు. భారాసకు తెలంగాణ తల్లి రూపం మార్పుపై కొట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. తల్లి తెలంగాణ పార్టీ రూపొందించిన విగ్రహాన్ని గతంలో భారాస మార్చితే ఎవరైనా కొట్లాడారా..? అని ప్రశ్నించారు. మన బోనాలు, బతుకమ్మ సంస్కృతి తరతరాలుగా నిలిచే ఉన్నాయి. వాటిని రాజకీయ పార్టీల ప్రయోజనాలకు వాడుకోవద్దని విజయశాంతి హితవు

# చలి పులి




## ..హైదరాబాద్ లో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): హైదరాబాద్ లో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మౌలాలి, హెచ్సీయూ ప్రాంతాల్ లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్ఎఎల్లో 7.4, రాజేంద్రనగర్లో 8.2 డిగ్రీలు, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడ్పల్లిలో 9.9, కుత్బుల్లాపూర్ 10.2, మచ్చబొల్లారంలో 10.2, శివరాంపల్లిలో 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్చెరు 11.7, షాపూర్ నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్ నగర్ 12, నేరెడ్మెట్ 12.1, లంగర్ హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్పేట 12.8, మాదాపూర్ 12.8, ము-షీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్గూడ 13.3, హయత్ నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు కనిష్ఠస్థాయికి పడిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. తిరుమలగిరిలో 13.6, చర్లపల్లిలో 13.6 డిగ్రీలు నమోదయ్యాయి. తాంద్ర(నిర్మల్)లో 6.3 డిగ్రీలు, పోచర (ఆదిలాబాద్) 6.4, జైనథ్(ఆదిలాబాద్) 6.5, అర్లి(టి) (ఆదిలాబాద్) 6.6, చాప్రాల్ (ఆదిలాబాద్) 6.6, సత్వార్(సంగారెడ్డి) 6.6, బంట్వారం(వికారాబాద్) 6.7, న్యాల్కల్ (సంగారెడ్డి) 6.7, ఎలిమినేడు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్(యూ)(ఆసిఫాబాద్) 6.7, చందనవల్లి (రంగారెడ్డి) 6.7, కోహీర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, నగరం(టి) (వికారాబాద్) 6.8, మన్నెగూడ (వికారాబాద్) 6.8, నల్లవెల్లి(సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్(సంగారెడ్డి) 6.9, మెనూర్(కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

పోక్సో చట్టం కింద తనపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది.



అమరావతి, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): పోక్సో చట్టం కింద తనపై పోలీసులు నమోదు చేసిన కేసు కొట్టివేయాలని వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్పై హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 24కు వాయిదా వేసింది. క్వాష్ పిటిషన్లో లో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పిటిషనర్ కు హైకోర్టు స్పష్టం చేసింది.

# రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం :మంత్రి నారాయణ

రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణ తెలిపారు.



మంగళగిరి, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని రైతుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని మంత్రి నారాయణతెలిపారు. నీరుకొండలో ఎంజీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేయాలని ఆర్-5 జోన్ తీసుకొచ్చిందని ఆరోపించారు. ఆర్-5 జోన్లో పట్టాలిచ్చిన పేదలకు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో స్థలాలిస్తామని చెప్పారు. సుప్రీంకోర్టులో రాజధానిపై ఉన్న కేసులు పరిష్కరించేలా ముందుకెళ్తున్నట్లు పేర్కొన్నారు . మరో 9 నెలల్లో అమరావతిలో అధికారులకు నివాసాలు అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో చెప్పిన విధంగానే రాజధానిని తప్పకుండా పూర్తిచేస్తామని.. మూడేళ్లలో ఇది సాధ్యం కానుందన్నారు. ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు సంబంధించిన టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం లభించిందని.. నాలుగైదు రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి నారాయణ చెప్పారు.

# బీఏసీ సమావేశం నుంచి భారాస , ఎంఐఎం వాకౌట్

తెలంగాణ స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ సమావేశం ముగిసింది.తెలంగాణ శాసన సభ




హైదరాబాద్. డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ స్పీకర్ ఛాంబర్ లో బీఏసీ సమావేశం ముగిసింది. అసెంబ్లీ ఎన్నిరోజులు నిర్వహించాలన్న దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సభ ఎన్నిరోజులు నడుపుతారో చెప్పడం లేదంటూ భారాస నేతలు హరీశ్రావు, ప్రశాంత్రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.సభను కనీసం 15 రోజుల పాటు నడపాలని కోరాం. ప్రభుత్వం మాత్రం 3 లేదా 4 రోజులు నడుపుతామని చెబుతోంది. ఇటీవల సమావేశాలకు టీ షర్టులతో వస్తే ఎందుకు అడ్డుకున్నారని నిలదీశాం. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ టీషర్టుతో పార్లమెంట్కు వెళ్లడం లేదా?" అని హరీశ్ ప్రశ్నించారు. బీఏసీ లేకుండానే బిల్లులు పెట్టడం సంప్రదాయ విరుద్ధమని హరీశ్ విమర్శించారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# పోలవరం ఏపీకి జీవనాడి: సీఎం చంద్రబాబు

పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందన్నారు.




**పోలవరం, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందన్నారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాధ్యపడుతుందన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలు, తాగునీటికి 23 టీఎంసీలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సోమవారం ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం ఆయన పోలవరం షెడ్యూల్ను ప్రకటించారు.66 పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్లు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ అవుతుంది. పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి అనుసంధానం చేశాం. రాబోయే రోజుల్లో నేరుగా కృష్ణా నుంచి నాగార్జున సాగర్ కెనాల్కు అనుసంధానం చేయాలి. గొల్లాపల్లి రిజర్వాయర్ వస్తే చాలావరకు ఇబ్బంది ఉండదు. వెలిగొండ ఇరిగేషన్కు కూడా నీళ్లు ఇచ్చే పరిస్థితి వస్తుంది. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తీసుకెళ్లొచ్చు.నేరుగా నీటిని విశాఖకు కూడా తరలించి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, అక్కడి నుంచి వంశధారకు వెళ్తుంది. ఈ పనులన్నీ పూర్తి చేయగలిగితే రాష్ట్రంలో అన్ని జిల్లాలకు ఉపయోగం ఉంటుంది. శ్రీకాకుళం నుంచి కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి వరకు నీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రాముఖ్యత చూస్తే 50 లక్షల క్యూసెక్కులు డిశ్చార్జ్ చేసే సామర్థ్యం ఉంది. 93 మీటర్ల డయా ఫ్రం వాల్.. అత్యంత ఎత్తైన స్పిల్ వే గేట్లు ఏర్పాటు చేస్తున్నాం. బహుళ ప్రయోజనాల కోసం వినియోగించే ప్రాజెక్టు పోలవరం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారు :హరీశ్ రావు

తెలంగాణలో రూ.691 కోట్ల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.





**హైదరాబాద్ , డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణలో రూ.691 కోట్ల బిల్లులు పెండింగ్లో ఉన్నాయని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని విమర్శించారు. గవర్నర్, మంత్రులను కలిసి వారు మొరపెట్టుకున్నారని చెప్పారు. చలో అసెంబ్లీ చేపడితే నిరసనకారులను అరెస్టు చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏడాదిగా గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వట్లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం, ఈజీఎస్ నిధులను మళ్లించారని ఆరోపించారు. తెలంగాణ పల్లెలను భారాస దేశానికి ఆదర్శంగా నిలిపిందని వివరించారు. కక్షతో సర్పంచులను ఇబ్బందులు పెడుతున్నారని.. గ్రామ పంచాయతీ ఎన్నికల లోపు బిల్లులు చెల్లించాలని హరీశ్రావు డిమాండ్ చేశారు.లగచర్ల రైతులకు బేడీలు వేసి అవమానించారని పేర్కొంటూ అంతకు ముందు భారాస ఎమ్మెల్యేలు హరీశ్రావు, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్రెడ్డి నిరసన తెలిపారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులతో అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకొని ప్లకార్డులు తీసుకొని లోపలికి పంపించారు.

# భూమా శోభనాగిరెడ్డికి నివాళి అర్పించిన మంచు మనోజ్ దంపతులు

మంచు మనోజ్ అత్త గారు, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆమెకు మంచు మనోజ్ దంపతులు ఘన నివాళులర్పించారు.




# రాచకొండ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

రాచకొండ పరిధిలో భారీగా డ్రగ్స్ ను పట్టుకున్నారు.



**హైదరాబాద్ , డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** చకొండ పరిధిలో భారీగా డ్రగ్స్ ను పట్టుకున్నారు. రూ.1.25 కోట్ల విలువైన 53.5 కిలోల పాపిస్ట్రా డ్రగ్స్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేశారు. మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్కు వాటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులను మీర్పేట, ఎల్బీనగర్ పోలీసులు పట్టుకున్నారు.

# అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్ లోనూ ప్రత్యేక చర్యలు :మంత్రి కొండా సురేఖ

అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్ లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు.



**హైదరాబాద్, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్ లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. ఆ ప్రాంతంలో విద్య, ఉపాధి దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. పులి దాడుల్లో చనిపోతే రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు.అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్రెడ్డి మాట్లాడుతూ.. కవ్వాల్లో ఇటీవల పులులు దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. అమ్రాబాద్ మాదిరిగా కవ్వాల్లోనూ చర్యలు తీసుకోవాలన్నారు. అడవి బిడ్డలు అడవిని ధ్వంసం చేయకుండా జీవిస్తున్నారని భారాస ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ చెప్పారు. పులి దాడుల్లో మరణించిన వారికి రూ.20 లక్షలు ఆర్థిక సాయం

# ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి కోరిన భారాస


కాంగ్రెస్ ప్రభుత్వంపై శాసనసభలో ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ ను భారాస కోరింది.



**హైదరాబాద్ , డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వంపై శాసనసభలో ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ను భారాస కోరింది. శాసనసభలో 168(1) నిబంధన ప్రకారం భారాస తరఫున ఆర్థిక మంత్రిపై నోటీసులు ఇచ్చింది. అప్పులు, వడ్డీల విషయంలో తెలంగాణ ప్రజలను, శాసనసభను ప్రభుత్వం తప్పుదోవ పట్టించిందని.. సభా హక్కుల ఉల్లంఘన కింద ప్రివిలేజ్ మోషన్కు అనుమతి ఇవ్వాలని భారాస నేతలు కోరారు.

# మంత్రి శ్రీధర్ బాబు డిశ్చార్జ్ పిటిషన్ కొట్టివేత

మంత్రి శ్రీధర్ బాబు డిశ్చార్జ్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది..



**హైదరాబాద్ , డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** మంత్రి శ్రీధర్ బాబు డిశ్చార్జ్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. 2017లో కాళేశ్వరం వద్ద గలాటా ఘటనలో ఆయనపై కేసు నమోదైంది. తనపై నమోదైన సెక్షన్లను కొట్టివేయాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం డిశ్చార్జ్ పిటిషన్ ను కొట్టివేసింది. అయితే, కింది కోర్టులో హాజరుకు మాత్రం మినహాయింపు ఇచ్చింది.

# రేడియేటర్ లో నీళ్ల కోసం విద్యార్థిని పంపిన డ్రైవర్ ..కుంటలో పడి ఇద్దరి మృతి

పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు వద్ద నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందారు.



**గురజాల, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు వద్ద నీటి కుంటలో పడి ఇద్దరు మృతి చెందారు. శ్రీ చైతన్య పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి, స్కూల్ బస్సు క్లీనర్లు నీట మునిగి చనిపోయారు. దాచేపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో శ్రీ చైతన్య స్కూల్ బస్సు నిలిచిపోయింది. బస్సు రేడియేటర్ లో నీళ్లు అయిపోవడంతో ఆగిపోయింది. దీంతో నీటి కోసం ఐదో తరగతి విద్యార్థిని డ్రైవర్ పంపాడు. సమీపంలోని కుంట వద్దకు వెళ్లిన విద్యార్థి అందులో పడిపోయాడు. విద్యార్థిని కాపాడేందుకు నీటి కుంటలో దిగిన క్లీనర్ కోటేశ్వరరావు కూడా నీట మునిగి చనిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పొగమంచు.. విశాఖకు విమానాల రాక ఆలస్యం

పొగ మంచు కారణంగా విశాఖ విమానాశ్రయానికి రావాల్సిన పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి.




**విశాఖ, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** పొగ మంచు కారణంగా విశాఖకు రావాల్సిన పలు విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నాయి. హైదరాబాద్ -విశాఖ, చెన్నై- విశాఖ విమాన సర్వీసులు ఆలస్యంగా నడుస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. 45 నిమిషాల ఆలస్యంగా నడుస్తున్నట్లు చెప్పారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో బెంగళూరు నుంచి రావాల్సిన విమానం అక్కడి నుంచి .

# నిద్రలో పొట్టలోకి పళ్ల సెట్టు ..అరుదైన చికిత్సతో బయటకు తీసిన విశాఖ వైద్యులు

విశాఖ షీలానగర్. కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో ఇటీవల అరుదైన చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి






**విశాఖపట్నం (అక్కిరెడ్డిపాలెం),డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** విశాఖ షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో ఇటీవల అరుదైన చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వారు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖ నగరానికి చెందిన ప్రకాశ్(52) పళ్ల సమస్య కారణంగా మూడేళ్ల క్రితం పళ్ల సెట్టును పెట్టించుకున్నారు. వారం రోజుల క్రితం నిద్రిస్తున్న సమయంలో పళ్ల సెట్టు ఊడి పొట్టలోకి వెళ్లిపోయింది. దగ్గు అధికంగా రావడంతో కిమ్స్ ఐకాన్ను సంప్రదించారు. పల్మనాలజిస్ట్ సీహెచ్ భరత్ రోగికి స్కానింగ్ చేసి కుడి పక్క ఊపిరితిత్తుల వద్ద పళ్ల సెట్టు ఉన్నట్లు గుర్తించారు. రిజిడ్ బ్రాంకోస్కోపి అనే పరికరం సాయంతో పళ్ల సెట్టును తీశారు. ఈ సందర్భంగా వైద్యుడు భరత్ మాట్లాడుతూ పళ్లకు రెండు వైపుల లోహం ఉందని.. జాగ్రత్తగా తీయకపోతే ఊపరితిత్తులకు, శ్వాస నాళాలకు ఇబ్బంది అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్య రాకుండా జాగ్రత్తగా తొలగించామన్నారు. రోగి కోలుకున్నారని తెలిపారు.

# జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు :డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఉద్యోగ ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి



**హైదరాబాద్, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** ఉద్యోగ ఖాళీలు అంచనా వేసి టీజీపీఎస్సీ ద్వారా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీక్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పారదర్శకంగా పరీక్షల నిర్వహణ చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగాల భర్తీ కోసమే జాబ్ క్యాలెండర్ ప్రకటించామని.. దశలవారీగా భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు చేపడతామన్నారు. జాబ్ క్యాలెండర్ మేరకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవం: మంత్రి ఉత్తమ్రేషన్ కార్డుల లెక్కలు పొంతన లేకుండా ఉన్నాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి అన్నారు. కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం పోతోందని అనుమానాలు వ్యక్తం చేశారు. దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా వాస్తవమన్నారు. ప్రజలు దొడ్డు బియ్యం తినట్లేదని.. సన్న బియ్యం ఇవ్వాలనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

# రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదు :మంత్రి పొంగులేటి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



**హైదరాబాద్, డిసెంబర్ 16, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ జిల్లానూ రద్దు చేయదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పాత జిల్లాలను రద్దు చేయాలన్న ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం వద్దకు నిధుల కోసం తరచూ వెళ్తాయని.. వెళ్లిన ప్రతిసారీ నిధులు రావని చెప్పారు. గతంలో భారాస హయాంలో ఎన్ని నిధులు వచ్చాయో తెలుసని ఎద్దేవా చేశారు. ఇది పేదల ప్రభుత్వమని.. పేదల కోసం పని చేస్తుందని పేర్కొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# అట్లీ లుక్ పై బాలీవుడ్ కమెడియన్ కామెంట్.. తిట్టిపోస్తున్న నెటిజన్లు

'జవాన్' తో బాలీవుడ్ లో ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు కోలీవుడ్ దర్శకుడు అట్లీ . ప్రస్తుతం ఆయన 'బేబీ జాన్' ప్రమోషన్ లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఓ కామెడీ షోలో పాల్గొన్నారు.




'జవాన్' తో హిందీ చిత్ర పరిశ్రమలో పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. కోలీవుడ్ దర్శకుడు అట్లీ ప్రస్తుతం ఆయన 'బేబీ జాన్' ప్రమోషన్స్లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా తాజాగా ఆయన 'ది గ్రేట్ ఇండియన్ కపిల్ షో'లో పాల్గొని సినిమా విశేషాలు పంచుకున్నారు. ఇదిలాఉ ండగా.. అట్లీ లుక్పై కపిల్ విమర్శలు చేస్తూ దర్శకుడిని అవమానించేలా వ్యవహరించాడు."కథ చెప్పడం కోసం ఎవరినైనా స్టార్ హీరోను మీరు కలిసినప్పుడు.. వాళ్లు అట్లీ ఎక్కడ అని అడుగుతారా?" అని కపిల్ ప్రశ్నించాడు. అతడి మాటల్లోని అర్థాన్ని అర్థం చేసుకున్న అట్లీ తనదైన శైలిలో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "మీరెందుకు ఈ ప్రశ్న నన్ను అడుగుతున్నారో నాకు అర్థమైంది. మీ ప్రశ్నకు నా సమాధానం ఒక్కటే.. టాలెంట్ ఉన్నప్పుడు మనం ఎలా ఉన్నామనేది పెద్ద విషయం కాదు. నిజం చెప్పాలంటే, దర్శకుడు ఏఆర్ మురుగదాసక్కు నేను కృతజ్ఞతలు చెప్పాలి. తొలిసారి ఒక కథతో ఆయన వద్దకు వెళ్లినప్పుడు.. ఆయన కేవలం నా స్క్రిప్ట్ గురించే ఆలోచించారు తప్ప నా లుక్ ఎలా ఉందనేది చూడలేదు. నా కథపై నమ్మకం ఉంచి నా తొలి చిత్రానికి నిర్మాతగా చేశారు. కాబట్టి, ప్రపంచం కూడా మన వర్క్ నే చూడాలి. రూపాన్ని బట్టి మనల్ని అంచనా వేయకూడదు" అని అట్లీ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఇది నెట్టింట వైరల్ గా మారింది. కపిల్ తీరును నెటిజన్లు తప్పుపడుతున్నారు. షోకు ఆహ్వానించి ఈవిధంగా అవమానించడం ఏమీ బాలేదని మండిపడుతున్నారు. ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.ఇదీ చదవండి: థియేటర్ క్రిస్మస్ మెరుపులు.. ఈ వారం థియేటర్/ ఓటీటీ చిత్రాలివే వరుణ్ ధావన్, కీర్తి సురేశ్ జంటగా నటించిన చిత్రం 'బేబీ జాన్'. కాలీస్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. వామికా గబ్బీ, జాకీష్రఫ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి అట్లీ కథ అందించారు. కోలీవుడ్లో విజయాన్ని అందుకున్న 'తెరీ' చిత్రానికి రీమేక్గా ఈ సినిమా తెరకెక్కిందనేది సమాచారం. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ఇది విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినీప్రియులను అలరించాయి.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1912: ఆదుర్తి సుబ్బారావు, తెలుగు సినిమా దర్శకుడు, నిర్మాత, రచయిత జయంతి (మ.1975).
- 1949: తోట తరణి, ప్రముఖ సినీ కళా దర్శకుడు. జాతీయ పురస్కార గ్రహీత జననం.
- 1951: సాలార్‌జంగ్ మ్యూజియం ను అప్పటి ప్రధానమంత్రి, జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించాడు. (చిత్రంలో)
- 1970: భారత ప్రధాన న్యాయమూర్తిగా ఎం.హిదయతుల్లా పదవీ విరమణ.
- 1971: భారత్–పాకిస్తాన్ మూడవ యుద్ధం ముగిసినది.
- 1971: బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఏర్పడింది.
- 1991: కజకస్తాన్ ప్రత్యేక దేశంగా ఏర్పడింది. స్వాతంత్రం పొందిన చివరి సోవియట్ రిపబ్లిక్ ఇది.




ఆదుర్తి సుబ్బారావు




తోట తరణి,




ముల్క్ రాజ్ ఆనంద్



జవహర్‌లాల్ నెహ్రూ



ఎం.హిదయతుల్లా



భారత్-పాకిస్తాన్



సోవియట్ రిపబ్లిక్ ఇది.

రిపబ్లిక్ సినిమా CINEMA

## ఇళయరాజా ఎంట్రీపై వివాదం .. ఆలయ అధికారుల స్పష్టత

శ్రీవిల్లిపుత్తూర్ ఆండాళ్ ఆలయంలోని అర్ధ మండలంలోకి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా ప్రవేశించడంపై వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. దీనిపై ఆలయ సిబ్బంది తాజాగా క్లారిటీ ఇచ్చారు.



తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూర్ ఆండాళ్ ఆలయాన్ని తాజాగా సందర్శించారు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా . ఈ ఆలయ సందర్శనలో భాగంగా గర్భగుడి ఎదురుగా ఉన్న అర్థ మండపంలోకి ఆయన ప్రవేశించారు. అక్కడే ఉన్న ఆలయ సిబ్బంది వెంటనే స్పందించి ఆయన్ని అక్కడినుంచి బయటకు పంపించేశారు. సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసిన ఈ విషయంపై ఆలయ సిబ్బంది తాజాగా క్లారిటీ ఇచ్చారు. అర్థ మండపంలోకి కేవలం జీయర్లకు మాత్రమే ప్రవేశం ఉందని తెలిపారు. ఆలయ నియమాలకు విరుద్ధంగా ఇతరులెవరూ ఆ మండపంలోకి ప్రవేశించడానికి వీల్లేదని చెప్పింది. ఇళయరాజా అనుకోకుండా అర్థమండపంలోకి వచ్చారని, గుర్తించిన వెంటనే సిబ్బంది ఆయన్ని బయటకు పంపించారని వివరణ ఇచ్చింది. ఇందులో ఏ వివాదం లేదని స్పష్టత ఇచ్చింది. ఇళయరాజా మ్యూజిక్ అందించిన తాజా చిత్రం 'విడుదలై 2' విడుదలకు సిద్ధంగా ఉంది.


## థియేటర్ లో క్రిస్మస్ మెరుపులు ..ఈ వారం థియేటర్/ఓటీటీ చిత్రాలివే!

క్రిస్మస్ కానుకగా వరుస చిత్రాలు ప్రేక్షకులను అలరించదానికి సిద్ధమయ్యాయి. గత పదిహేను రోజులుగా బాక్సాఫీస్ వద్ద పుష్పరాజ్ హవా కొనసాగగా, ఇప్పుడు సరికొత్త చిత్రాలు సందడి చేయబోతున్నాయి. మరోవైపు ఓటీటీలోనూ కొత్త సినిమాలు, సిరీస్ లు స్ట్రీమింగ్ కాబోతున్నాయి.




"నన్నొద్దనుకున్నోళ్లు ఎవరి కోసం నేను ఆలోచించను.. బాధపడను'అంటున్నాడు మల్లి. మరి అతనెవరు? తన ప్రేమకథేంటి? తెలియాలంటే 'బచ్చల మల్లి'చూడాల్సిందే. అల్లరి నరేశ్ టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని సుబ్బుమంగదేవి తెరకెక్కించారు. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా సంయుక్తంగా నిర్మించారు. అమృత అయ్యర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 20న రానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్, ట్రైలర్ సినిమాపైఅంచనాలను పెంచాయి. వెనక్కి వెళ్లి సరిదిద్దుకోలేని తప్పులు మూర□త్వంతో చేయొద్దనే అంశంతో ఈ కథను తీర్చిదిద్దినట్లు చిత్ర బృందం చెబుతోంది. బచ్చలమల్లి చేసిన ఆ తప్పులేంటి? వాటి పర్యవసానాలు ఏంటి? తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

## మరో వైవిధ్యమైన కథతో.. ఇటు హీరోగా.. అటు దర్శకుడిగా ఉపేంద్ర




'ఏ', 'ఉపేంద్ర' లాంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో ఇటు హీరోగా.. అటు దర్శకుడిగా ప్రేక్షకులపై చెరగని ముద్ర వేశారు ఉపేంద్ర ఇప్పుడాయన హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో 'యూఐ' అనే ఫాంటసీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. దీన్ని లహరి ఫిల్మ్స్, జి.మనోహరన్ అండ్ వీనస్ ఎంటర్టైనర్స్, కేపీ శ్రీకాంత్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబరు 20న ఈ మూవీ దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదల కానుంది. 'ఇదొక వినూత్నమైన ఫాంటసీ చిత్రం. ఉపేంద్ర ఓ వీరోచితమైన పాత్రలో సరికొత్త గెటప్లో కనిపిస్తారు. సినిమా మొత్తాన్ని వర్చువల్ రియాలిటీ పైప్లైన్లో చిత్రీకరించాం. ఇండస్ట్రియల్ లైట్ అండ్ మ్యూజిక్ క్రియేషన్ టెక్నాలజీని ఉ పయోగించాం. కచ్చితంగా విజువల్స్, సంగీతం సరికొత్త అనుభూతిని అందిస్తాయని చిత్ర బృందం చెబుతోంది.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## విరాట్..ఆ బంతి ఆడటం అవసరమా? : సునీల్ గావస్కర్ ఫైర్

2024..! ఆస్ట్రేలియాపై మంచి రికార్డు కలిగిన విరాట్ కోహ్లి ఈసారి మాత్రం తన బలహీనతతో ఔట్ కావడం అభిమానులను తీవ్ర నిరుత్సాహానికి గురి చేస్తోంది.




విరాట్ కోహ్లి మరోసారి అదే తప్పిదానికి పాల్పడ్డాడు. ఒకవైపు ఆసీస్ బ్యాటర్లు భారీ స్కోరు సాధించిన పిచ్పై టీమ్ ఇండియా ఆటగాళ్లు తడబాటుకు గురయ్యారు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4)కు మరోసారి లక్ కలిసి రాలేదు. అతడిని స్టార్క్ టార్గెట్ చేశాడు. ఇక శుభ్మన్ గిల్ (1), విరాట్ కోహ్లి (3) ఔటైన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. గిల్ షాట్ కొట్టేందుకు ప్రయత్నించి పెవిలియన్ కు చేరాడు. కానీ, సీనియర్ బ్యాటర్ అయిన విరాట్ మాత్రం మరోసారి తన బలహీనతను బయటపెట్టాడు. హేజిల్వుడ్ వేసిన ఆఫ్సైడ్ బంతిని కదిలించి మరీ కోహ్లి వికెట్ కీపర్కు దొరికిపోయాడు. ఇలా ఔట్ కావడం ఈ సిరీస్లోనే మూడోసారి. దీంతో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర స్థాయిలో విమర్శించాడు. కాస్త ఓర్పు కూడా ప్రదర్శించలేవా ? అంటూ ప్రశ్నించాడు. నాలుగేళ్లలో మూడు సెంచరీలు మాత్రమే కొట్టిన విరాట్ కోహ్లికి అలాంటి బంతిని ఆడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించాడు.ఇదీ చదవండి: ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య మూడో టెస్టు లైవ్ అప్ డేట్స్ "ఒకవేళ నాలుగో స్టంప్ వైపు బంతిని విసిరితే ఆడేందుకు ప్రయత్నించడాన్ని నేను అర్థం చేసుకుంటా. కానీ, బంతి మరీ దూరంగా వెళ్తోంది. దానిని ఆడాల్సిన అవసరమే లేదు. ఈసారి కోహ్లి తీవ్రంగా నిరుత్సాహపరిచాడు. కాస్త ఓర్పు ప్రదర్శించి ఉంటే కేఎల్ రాహుల్తో కలిసి క్రీజ్లో ఉండేవాడు. కానీ, బయటకు వెళ్లే బంతిని కదలించి మరీ చిక్కాడు. రిషబ్ పంత్ బ్యాటింగ్కు వచ్చేసరికి వర్షం మొదలైంది. విరాట్ పేలవ షాట్తో అభిమానులను షాక్కు గురి చేశాడు" అని గావస్కర్ తెలిపాడు.

## ఇంటి చిట్కాలు




అత్తి పండ్లలో నేచురల్ షుగర్ ఉంటుంది. కానీ, ఇందులోని ఫైబర్ బ్లడ్ షుగర్ లెవల్స్‌ని మెంటెయిన్ చేస్తుంది. అయితే షుగర్ ఉ న్నవారు డాక్టర్‌ని కన్సల్ట్ అయ్యాకే ఈ పండ్లని తినడం మంచిది. ఈ పండ్లని నేరుగా తినడం కంటే నీటిలో నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగడం వల్ల చాలా లాభాలున్నాయని డాక్టర్స్ చెబుతున్నారు. ఈ నీటిని తాగడం వల్ల అధిక బరువు నుంచి జీర్ణక్రియ వరకూ చాలా సమస్యలు దూరమవుతాయి.ఫిగ్స్‌లో ఖనిజాలు, ఫైబర్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు ఉ న్నాయి. సరోజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఢిల్లీలోని డైటెటిక్స్ డాక్టర్ నిధి ధావన్ ప్రకారం.. సహజ చక్కెరలు, యాంటీ ఆక్సిడెంట్స్ ఈ పండ్లలో ఎక్కువగా ఉంటాయి. ఈ పండ్లని నీటిలో నానబెట్టి ఉదయాన్నే పరగడపున ఆ నీటి తాగితే అందులోని పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. మరి ఈ అంజీర్ నానబెట్టిన నీటిని తాగడం వల్ల కలిగే లాభాలేంటో తెలుసుకోండి.

### బరువు తగ్గడం..



అంజీర్ పండ్లలో ఎక్కువగా ఫైబర్ ఉంటుంది. వీటిని నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల మనకి కడుపులో నిండుగా అనిపిస్తుంది. దీంతో క్రేవింగ్స్ తగ్గుతాయి. ఎక్కువగా తినరు. జంక్ జోలికి వెళ్లరు. ఉదయాన్నే ఈ నీటిని తాగడం వల్ల మెటబాలిజం బూస్ట్ అవుతుంది. దీంతో బరువు తగ్గడానికి వీలవుతుంది. త్వరగా బరువు తగ్గుతారు. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ కరుగుతుంది. ఈ పండ్లలో తక్కువగా సోడియం ఉంటుంది. కాబట్టి, బీపి కూడా తగ్గుతుంది. అంజీర్ నీటిని తీసుకోవడం చాలా మంచిదని గుర్తుపెట్టుకోండి.


## ఫిగ్స్‌ని పరగడపున ఇలా తీసుకోండి.. అధికబరువు, షుగర్‌తో పాటు ఈ సమస్యలన్నీ దూరం

### జీర్ణ సమస్యలు..



అంజీర్ పండ్లని నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల మలబద్ధకం, జీర్ణ సమస్యలు దూరమవుతాయి. కడుపునొప్పి, బ్లోటింగ్ వంటి సమస్యలు దూరమవుతాయి. ఫిగ్స్‌లో ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల అవి నేచురల్ లాక్సేటీవ్స్‌లా పనిచేస్తాయి. ఈ నీటిని మనం రెగ్యులర్‌గా తీసుకుంటే జీర్ణక్రియ ప్రక్రియని బలంగా చేస్తుంది. కడుపు సంబంధిత సమస్యల్ని దూరం చేస్తుంది.

### డీటాక్స్..




ఫిగ్స్ నానబెట్టిన నీటిని తాగడం వల్ల బాడీ డీటాక్సీఫై అవుతుంది. ఇది శరీరంలో ఉండే టాక్సిన్స్‌ని దూరం చేస్తుంది. దీంతోపాటు లివర్ పనితీరుని మెరుగ్గా చేస్తుంది. దీంతో పాటు శరీరంలోని విషపదార్థాలని బయటికి పంపుతుంది.

### షుగర్ ఉన్నవారికి..




అంజీర్ పండ్లలో ఎక్కువగా సోల్యూబుల్ ఫైబర్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల బాడీలో షుగర్ మెల్లిగా అబ్జార్బ్ అయ్యేలా చేస్తాయి. దీంతో షుగర్ కూడా పెరుగదు. అయితే, ఇది నిపుణుల సలహాతోనే తీసుకోవాలని గుర్తుపెట్టుకోండి.

### ఎముకల ఆరోగ్యానికి..




ఈ పండ్లలో కాల్షియం, మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. వీటిని నానబెట్టి ఆ నీటిని తాగడం వల్ల ఎముకలు బలంగా మారతాయి. జాయింట్ పెయిన్స్ తగ్గి కీళ్లు బలంగా మారతాయి. ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రావు. ఖాళీ కడుపుతో అంజీర్ నీరు తాగడం వల్ల ఎముకలకి సంబంధించిన సమస్యలు తగ్గుతాయి.

### గుండె సమస్యలు..



ఫిగ్స్‌లో పొటాషియం ఎక్కువగా ఉ ంటుంది. వీటిని నానబెట్టి తాగడం వల్ల బ్లడ్ ప్రెజర్ లెవల్స్ తగ్గుతాయి. ఇందులో ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ ఉ ంటాయి. దీని వల్ల గుండె సమస్యలు రాకుండా గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. రెగ్యులర్‌గా ఈ నీటిని తాగడం చాలా మంచిది.

### ఎలా చేయాలి..



డ్రై ఫిగ్స్ తీసుకోవాలి. వీటిని క్లీన్ చేసి ముందురోజు రాత్రి గ్లాసు నీటిలో నానబెట్టాలి. ఆ నీటిని ఉదయాన్నే తాగి పండ్లని తినండి. ఈ పండ్లు తినడం వల్ల డైజేషన్ సరిగా అవుతుంది. ఫ్లేవర్ బాగుంటుంది. ఈ నీటిని తాగితే పైన చెప్పిన లాభాలన్నీ ఉంటాయి. కాబట్టి, రెగ్యులర్‌గా తాగడం అలవాటు చేసుకోండి.